సాక్షి
విశాఖపట్నం
ఆదివారం । 20 । ఏప్రిల్ । 2025



'కెమికల్'లో అవకాశాలెన్నో..

కెమికల్ ఇంజనీరింగ్ డిప్లమా పూర్తి చేసిన బాలికలు సైతం అబ్బాయిలతో సమానంగా ఉద్యోగాలు సాధిస్తూ సత్తా చాటుతున్నారు. 6లో



హైడ్రామా

మధురవాడలో గిఫ్ట్‌డీడ్ స్థలాల్లో దుకాణాల తొలగింపులో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. 4లో

'అ అంటే అమలాపురం' అభిమానులకు చేదు అనుభవం 4లో



• కూటమి 'మహా' నాటకం

ప్రజాస్వామ్యం ఖూనీ



లోపలకు ప్రవేశించేందుకు గేటును తోస్తున్న కూటమి నాయకులు, అడ్డుకుంటున్న పోలీసులు

జీవీఎంసీలో శనివారం జరిగిన పరిణామాలు ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ. అధికార మదంతో, ధన బలంతో కూటమి నేతలు సాగించిన అరాచకం యావత్ రాష్ట్రాన్ని నివ్వెరపరిచింది. కేవలం 10 నెలల అధికారం కోసం.. ప్రజల చేత ఎన్నికైన ఒక బీసీ మహిళా మేయర్‌ను గద్దె దించేందుకు వారు పన్నిన కుట్రలు, కుతంత్రాలు హేయమైనవి. ఈ చర్యలు విశాఖ నగర ప్రతిష్టను మసకబార్చాయి. యాదవ సామాజిక వర్గానికి చెందిన బీసీ మహిళ విషయంలో అధికార కూటమి సాగించిన 'మహా' నాటకం ఇది. - డాబాగార్డెన్స్

- ఫిరాయింపులతో నెగ్గిన అవిశ్వాసం
- డబ్బు, బెదిరింపులతో జీవీఎంసీ పీఠం కైవసం
- ఒకే ఒక్క ఓటుతో గట్టెక్కిన వైనం
- బీసీ మహిళా మేయర్‌పై కక్ష సాధింపు

అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖలో కూటమి నేతల లక్ష్యం ఒక్కటే.. మేయర్ పదవిని ఎలాగైనా చేజిక్కించుకోవడం. ఇందుకోసం వారు నైతిక విలువలను తుంగలో తొక్కారు. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను భయపెట్టారు. బెదిరించారు. లొంగని వారిపై ఒత్తిడి తెచ్చారు. కోట్ల రూపాయలను ఎరగా వేసి.. కొందరు కార్పొరేటర్ల ఆత్మగౌరవాన్ని కొనుగోలు చేశారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ.. కూటమి నేతలు సాగించిన కుట్రలు, కుతంత్రాలు, డబ్బు రాజకీయాలు శనివారం నగర ప్రజల ముందు బట్టబయలయ్యాయి. నెలరోజులకు పైగా సాగించిన ఈ ప్రయత్నాల్లో కోట్లాది రూపాయలు మంచినీళ్లలా ఖర్చు చేసినా.. కార్పొరేటర్లను చివరి నిమిషం వరకు బెదిరించి, లోబరచుకోవాల్సిన దుస్థితి అధికార కూటమికి ఏర్పడింది.

అధికార దుర్వినియోగం, పోలీసుల పహారా

అవిశ్వాస తీర్మానం రోజు కూటమి నేతల అప్రజాస్వామిక చర్యలు పరాకాష్టకు చేరాయి. చివరి నిమిషం వరకు తమ సంఖ్యాబలంపై నమ్మకం లేక.. కార్పొరేటర్లు చేజారిపోతారనే భయంతో వణికిపోయారు. అవిశ్వాస సమావేశం సందర్భంగా వారి వ్యవహారశైలి



జీవీఎంసీ వద్ద పోలీసుల బందోబస్తు

చూస్తే ఇదే స్పష్టమైంది. హోటళ్లలో దాచిన కార్పొరేటర్లను అక్కడి నుంచి జీవీఎంసీకి తరలించే క్రమంలో అడుగడుగునా పోలీసులను అడ్డుపెట్టుకున్నారు. వారి సమక్షంలోనే నేరుగా జీవీఎంసీలోకి బస్సు వెళ్లింది. బస్సు దిగిన తర్వాత కూడా కూటమి నేతల ఆగడాలు ఆగలేదు. కార్పొరేటర్లను బెదిరిస్తూ సమావేశ మందిరంలోకి తీసుకెళ్లారు. అనుకూలంగా చెయ్యి ఎత్తకపోతే తీవ్ర పరిణామాలుంటాయని బెదిరించి ఓట్లు వేయించుకున్నారు. ఎన్ని కుట్రలు, బెదిరింపులు, ప్రలోభాలు సాగించినా, చివరికి అవిశ్వాస తీర్మాన సమయానికి వారికి దక్కిన బలం కేవలం 74 మంది మాత్రమే! చివరి నిమిషంలో తిప్పల వంశీతో పాటు మాజీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు భార్య, కోడలు వంటి వారిపై తీవ్ర ఒత్తిడి తెచ్చి కూటమి వైపు తిప్పుకున్నారు. వారిలో ఏ ఒక్కరు రాకపోయినా అవిశ్వాసం వీగిపోయేది.

వైఎస్సార్ సీపీకి స్పష్టమైన మెజార్టీ ఉన్నా..

2021లో జరిగిన ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్ సీపీకి స్పష్టమైన మెజార్టీ ఇచ్చి 59 స్థానాల్లో గెలిపించారు. టీడీపీ 29, జనసేన 3తో పాటు ఇతరులు గెలుపొందారు. బీసీ జనరల్‌కు రిజర్వ్ అయిన మేయర్ పదవిలో యాదవ సామాజిక వర్గానికి చెందిన గొలగాని హరి వెంకటకుమారిని అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కూర్చోబెట్టారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రాగానే జీవీఎంసీపై కన్ను పడింది. ప్రజా తీర్పును గౌరవించకుండా, ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ మేయర్‌ను దించేందుకు కుతంత్రాలు మొదలుపెట్టారు. నాలుగేళ్ల అవిశ్వాసం నిబంధన ఉన్నప్పటికీ.. వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లను కొనుగోలు చేసేందుకు బహిరంగంగానే కోట్లాది రూపాయలు కుమ్మరించినట్టు ఆరోపణలు వెల్లువెత్తాయి. కొందరు టీడీపీలోకి, మరికొందరు జనసేనలోకి జంప్ చేసి తమ నీతిమాలిన రాజకీయాన్ని ప్రదర్శించారు. కేవలం 29 మందితో ఉన్న టీడీపీ, ఫిరాయింపులతో బలం పెంచుకుని ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసింది.

అవిశ్వాసం సాగిందిలా..

జీవీఎంసీలో మొత్తం స్థానాలు 98కి గానూ అప్పట్లో వైఎస్సార్ సీపీ నుంచి గెలిచిన వంశీకృష్ణ ఎమ్మెల్సీగా ఎన్నిక కావడంతో తన కార్పొరేటర్ పదవికి రాజీనామా చేశారు. ఆ స్థానానికి ఎన్నిక జరగలేదు. దీంతో 97 మంది కార్పొరేటర్లు, 14 మంది ఎక్స్ అఫీషియో సభ్యులు ఉన్నారు. మొత్తం 111 మంది సభ్యుల్లో 2/3 వంతు మెజార్టీ ఉంటేనే అవిశ్వాస తీర్మానం నెగ్గుతుంది. ఆ లెక్కన 74 మంది సభ్యుల మద్దతు కూటమికి అవసరం. ఆ మ్యాజిక్ ఫిగర్ చేరుకోవడానికి నేతలు తలకిందులుగా ప్రయత్నించారు. ఈ క్రమంలో ఇన్‌చార్జి కమిషనర్ హరేంధిర ప్రసాద్‌కు గత నెల నోటీసులిచ్చారు. ఈ మేరకు శనివారం అవిశ్వాస తీర్మానంపై సమావేశం జరిగింది. సరిగ్గా 74 మందే హాజరు కావడంతో కూటమి నెగ్గింది.



బస్సులో లోపలకు వెళ్తున్న కూటమి కార్పొరేటర్లు

యాదవ మహిళ టార్గెట్

యాదవ సామాజిక వర్గానికి చెందిన గొలగాని **హరి** వెంకటకుమారి మేయర్‌గా ఉండటం **ఇష్టం లేక** కూటమి నేతలు కక్షగట్టారు. ఒక బీసీ **మహిళ** ఆ పదవిలో ఉండటాన్ని సహించలేకపో**యారు.** ఆమెను గద్దె దించడమే ఏకైక లక్ష్యంగా పెట్టుకుని.. నెలల తరబడి కుట్రలు పన్నారు. ఇది కేవలం రాజకీయ అవిశ్వాసం కాదు.. ఒక సామాజిక వర్గానికి చెందిన మహిళపై జరిగిన దాడిగా చూడాలని పలు వర్గాలకు చెందిన నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

నైతికత లేని విజయం

ఇన్ని కుట్రలు, కుతంత్రాలు, బెదిరింపులు, ప్రలోభాలకు పాల్పడినా, కూటమి నేతలు సాధించింది ఏమిటి? అవిశ్వాస తీర్మానం నెగ్గడానికి అవసరమైన 74 మంది సభ్యులను మాత్రమే.. అదీ చివరి నిమిషంలో కొందరిని ఒత్తిడికి గురి చేసి సమీకరించగలిగారు. ఒక్క సభ్యుడు తగ్గినా వారి కుట్ర బెడిసికొట్టేది. వైఎస్సార్ సీపీ టికెట్‌పై గెలిచి, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసి, పదవికి రాజీనామా చేయకుండా పార్టీ మారిన వారిపై ఆధారపడి సాధించిన ఈ విజయం అనైతికం. నిజంగా ధైర్యం ఉంటే, ఫిరాయించిన కార్పొరేటర్లు తమ పదవులకు రాజీనామా చేసి, తిరిగి ఎన్నికలకు వెళ్లాలని నగర ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రజలు ఒక పార్టీ జెండాపై గెలిపిస్తే.. డబ్బులకు, పదవులకు ఆశపడి పార్టీలు మారిన వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ల తీరును అసహ్యించుకుంటున్నారు.

కార్పొరేటర్లను భయపెట్టారు

ప్రశాంతతకు మారు పేరుగా విశాఖకు మంచి పేరుంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యాదవ సామాజిక వర్గానికి చెందిన బీసీ మహిళకు మేయర్ పదవినిచ్చి గౌరవిస్తే.. యావత్ రాష్ట్రం హర్షం వ్యక్తం చేసింది. ఈవీఎంల ద్వారా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం డబ్బు సంచులతో, విపరీత ధోరణితో మహిళా కార్పొరేటర్లను సైతం భయపెట్టి మేయర్ పీఠం దక్కించుకుంది. కూటమి నేతలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు.

– కె.రామచంద్రమూర్తి, సీనియర్ సిటిజన్

విప్ ధిక్కరించిన 27 మందిపై అనర్హత వేటు వేయండి

వైఎస్సార్ సీపీ డిమాండ్

సాక్షి, విశాఖపట్నం: మేయర్‌పై జరిగిన అవిశ్వాస తీర్మానంలో పార్టీ విప్‌ను ధిక్కరించి ఓటు వేసిన 27 మంది వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లను తక్షణమే అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ ఆ పార్టీ విప్ తైనాల విజయ్‌కుమార్.. జిల్లా ఎన్నికల అధికారి, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ హరేంధిర ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. 2008 మున్సిపల్ కార్పొరేషన్ చట్టం(జీవో ఎంఎస్ నంబర్ 836/ఎంఏయూడీ)లోని రూల్ నంబర్ 9 లోని 'నో కాన్ఫిడెన్స్ మోషన్' నిబంధనలను ఈ సందర్భంగా తైనాల ప్రస్తావించారు. ఈ రూల్ ప్రకారం ఏదైనా పార్టీ గుర్తుపై గెలిచిన ప్రజా ప్రతినిధులు, అవిశ్వాస తీర్మానం వంటి సందర్భాలలో పార్టీ ఆదేశించిన విధంగానే ఓటు వేయాలి. లేని పక్షంలో వారి సభ్యత్వాన్ని రద్దు చేసే పూర్తి హక్కు సంబంధిత పార్టీకి ఉంటుందని ఆయన గుర్తు చేశారు. ఫిరాయింపులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకుంటే.. న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని హెచ్చరించారు. పార్టీ నేత పల్లా దుర్గారావు ఆయన వెంట ఉన్నారు.



జిల్లా ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే తైనాల, పల్లా దుర్గారావు

కార్పొరేటర్లను పశువుల్లా కొన్నారు

వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ కన్నబాబు, మాజీ మంత్రి అమర్‌నాథ్



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ కన్నబాబు, మాజీమంత్రి అమర్‌నాథ్, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, రవిబాబు, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, మాజీ ఎమ్మెల్యేలు ధర్మశ్రీ, తైనాల

సాక్షి, విశాఖపట్నం: తమ పార్టీలో గెలిచిన కార్పొరేటర్లను సంతలో పశువులు మాదిరిగా కొన్నారని వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ కన్నబాబు, మాజీమంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, కుంభా రవిబాబుతో కలసి వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తీరు చూస్తుంటే ప్రజాస్వామ్యంలో ఉన్నామా.. రాచరికంలో ఉన్నామా అనే అనుమానాలు కలుగుతున్నాయన్నారు. ప్రజాస్వామ్యాన్ని, విలువలను అపహాస్యం చేసి అవిశ్వాసం గెలిచినా.. రాజకీయంగా వాళ్లకు వాళ్లే సమాధి కట్టుకున్నారని విమర్శించారు. అధికారంలోకి వచ్చాక ఇతర పార్టీ నాయకులను తీసుకోబోమని డిప్యూటీ సీఎం చెప్పారని, కేవలం 10 నెలల మేయర్ పీఠం కోసం ఇప్పుడు తమ కార్పొరేటర్లను ఇబ్బందులకు గురి చేశారన్నారు. దమ్ము, ధైర్యం ఉంటే తమ పార్టీ నుంచి తీసుకున్న 27 మంది కార్పొరేటర్లతో రాజీనామా చేయించి.. మీ పార్టీ గుర్తుల మీద గెలిపించి మేయర్ పదవిని దక్కించుకోవాలని సవాల్ విసిరారు. బీసీ మహిళను దించిన పార్టీలుగా తెలుగుదేశం, బీజేపీ, జనసేన చరిత్రలో మిగిలిపోతాయని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, తైనాల విజయ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైస్రాయ్ హోటల్ రాజకీయాలే నేటికీ నడుస్తున్నాయని, విశాఖ ప్రజలు తీవ్ర ఇబ్బందుల్లో ఉంటే 10 నెలల మేయర్ పీఠం కోసం దిగజారి రాజకీయాలు చేశారని విమర్శించారు. నాలుగేళ్లుగా నిజాయితీతో పనిచేస్తున్న బీసీ మహిళను దించడం దారుణమన్నారు. మేయర్ పై అవిశ్వాస తీర్మానంలో అధికార బలంతో, డబ్బుందన్న అహంకారంతో ప్రత్యేక విమానాలు తీసుకుని ప్రజాధనాన్ని ఖర్చు చేశారని మండిపడ్డారు. వ్యవస్థలను, పోలీసులను, అధికారులను ఉపయోగించుకుని స్వల్ప తేడాతో గెలిచారని ఎద్దేవా చేశారు. సమావేశంలో జెడ్పీ చైర్ పర్సన్ జె.సుభద్ర, అనకాపల్లి సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ పాల్గొన్నారు.

మేయర్‌గా ప్రయాణం సంతృప్తికరం

- వైఎస్ జగన్ ఆశీస్సులతోనే సేవ చేసే గొప్ప అవకాశం దక్కింది
- నగర ప్రజలకు కృతజ్ఞతలు : గొలగాని హరివెంకటకుమారి



సభను నడిపిస్తున్న మేయర్ గొలగాని హరి వెంకటకుమారి(ఫైల్)

డాబాగార్డెన్స్: జీవీఎంసీ మేయర్‌గా నాలుగేళ్ల పాటు ప్రజలకు సేవ చేసే గొప్ప అవకాశం లభించడం తనకెంతో సంతృప్తినిచ్చిందని గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. తన పదవిని బాధ్యతాయుతంగా నిర్వర్తిస్తూ, నగర పౌరులకు సేవలు, సంక్షేమ పథకాలు అందించడంలో, మౌలిక సదుపాయాలు కల్పించడంలో కృషి చేశానని తెలిపారు. ఈ నాలుగేళ్ల కాలంలో నగర అభివృద్ధికి తాను ఎంతో కృషి చేశానని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా, ప్రతి కార్పొరేటర్‌ను సమ దృష్టితో చూస్తూ.. వారి వార్డుల అభివృద్ధికి మనస్ఫూర్తిగా నిధులు కేటాయించినట్లు గుర్తు చేసుకున్నారు. ఎన్నో క్లిష్టమైన సమస్యలను పరిష్కరించే అవకాశం లభించిందని, ముఖ్యంగా కరోనా మహమ్మారి విజృంభించిన సమయంలో ప్రజలకు అండగా నిలబడి, వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించడం గొప్ప సేవానుభూతినిచ్చిందన్నారు. అడవివరం నుంచి గోశాల వరకు రోడ్డు, జగదాంబ జంక్షన్ నుంచి పూర్ణామార్కెట్, పాత పోస్టాఫీస్ వరకు రోడ్లు, బస్‌బేలు, జంక్షన్ల అభివృద్ధి వంటి అనేక పనుల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించినట్లు చెప్పారు. తనకు వ్యతిరేకంగా ఓటు వేసిన కార్పొరేటర్లకు సైతం నిధుల కేటాయింపులో ఎటువంటి వివక్ష చూపలేదనే విషయం తెలుసునని హరివెంకటకుమారి అన్నారు. నాలుగేళ్ల ఒక నెల పాటు మేయర్ క్యాంపు కార్యాలయాన్ని తన సొంత భవనంలో నిర్వహించుకుంటూ.. కార్పొరేషన్ నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకోలేదన్నారు. నగరం కాలుష్యానికి గురి కాకూడదనే ఉద్దేశంతో ప్రతి సోమవారం సొంత వాహనాన్ని వదిలి ఆర్టీసీ బస్సులో జీవీఎంసీకి వచ్చానని, ఈ విషయంలో తోటి ఉద్యోగులను కూడా ప్రోత్సహించినట్లు చెప్పారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో దేశంలోనే విశాఖ గర్వించేలా ర్యాంకులు సాధించడంలో తన వంతు కృషి చేశానన్నారు. అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు మంజూరు చేసిన తనపైనే అవిశ్వాస తీర్మానం పెట్టడం బాధ కలిగించిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆశీస్సులతోనే యాదవ సామాజిక వర్గానికి చెందిన బీసీ మహిళగా తనకు ప్రజలకు సేవ చేసే గొప్ప అవకాశం లభించిందని ఆమె గుర్తు చేసుకున్నారు. ఈ ప్రయాణంలో తనకు సహకరించిన నగర ప్రజలు, అధికారులు, పార్టీ నేతలు, కార్పొరేటర్లు, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, కురసాల కన్నబాబు, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, మీడియాకు కృతజ్ఞతలు తెలిపారు.

85 కేసుల్లో 112 మంది అరెస్ట్

- రూ.95 లక్షల సొత్తు స్వాధీనం
- రూ.48 లక్షల విలువ గల 320 సెల్‌ఫోన్లు రికవరీ



బాధితుడికి బైక్ తాళం అందజేస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి



బాధిత మహిళకు బంగారు హారం అందజేస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

అల్లిపురం: విశాఖ నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో మార్చిలో జరిగిన 130 ఆస్తి దొంగతనాల కేసుల్లో 85 కేసులను పోలీసులు ఛేదించారు. మొత్తం 112 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి వెల్లడించారు. నిందితుల నుంచి రూ.95,40,793 విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు. సూర్యాబాగ్‌లోని పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిషనర్ మాట్లాడారు. రికవరీ చేసిన సొత్తులో రూ.48 లక్షల విలువైన 320 సెల్‌ఫోన్లు, రూ.47,40,793 విలువైన ఇతర ఆస్తులు ఉన్నాయన్నారు. పట్టుబడిన కేసుల్లో 3 రోబరీలు, 4 పగటిపూట జరిగిన ఇంటి దొంగతనాలు, 8 రాత్రి పూట జరిగిన ఇంటి దొంగతనాలు, 4 చైన్ స్నాచింగ్‌లు, 21 మోటార్ సైకిల్ దొంగతనాలు, 1 వైర్ దొంగతనం, 44 సాధారణ దొంగతనాలు ఉన్నాయని వివరించారు. రికవరీ చేసిన వాటిలో 1.02 కేజీల బంగారం, ఒక డైమండ్ ఉంగరం, రూ.9,49,500 నగదు, 22 మోటార్ సైకిళ్లు, 4 దొంగిలించబడిన మొబైల్ ఫోన్లు, 320 మిస్ అయిన మొబైల్ ఫోన్లు, ఒక ల్యాప్‌టాప్, 5 మేకలు, 5 లారీ బ్యాటరీలు, 500 కేజీల ఎలక్ట్రికల్ వైర్ ఉన్నాయని కమిషనర్ తెలిపారు.

నేరాల నియంత్రణకు చర్యలు

నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని డాక్టర్ శంఖబ్రత బాగ్చి పేర్కొన్నారు. మార్చిలో నగరంలోని వివిధ ప్రాంతాల్లో 755 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు 183 కార్యక్రమాలు నిర్వహించామని, నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో నిరంతర పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్నవారు సైబర్ క్రైం పోలీసులకు చెందిన 94906 17196 నంబర్‌కు 'హాయ్'అని మెసేజ్ చేయడం ద్వారా వాటిని త్వరగా తిరిగి పొందవచ్చని కమిషనర్ సూచించారు. డీసీపీ-1, ఏడీసీపీలు, ఏసీపీలు, సీఐలు పాల్గొన్నారు.

అమర్‌నాథ్ యాత్రకు వెళ్లే వారికి కేజీహెచ్‌లో సర్టిఫికెట్లు

మహారాణిపేట: అమర్‌నాథ్ యాత్రకు వెళ్లే వారు మెడికల్ సర్టిఫికెట్ కోసం కేజీహెచ్‌లో ప్రతి మంగళ, గురువారాల్లో సంప్రదించాలని సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ తెలిపారు. ఓపీ సమయంలో జూనియర్ అసిస్టెంట్ కె.మురళీ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.కిరణ్ కుమార్ పరీక్షలు చేసి సర్టిఫికెట్లు జారీ చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మెయిన్స్‌లో మెరిశారు

సీతమ్మధార/మద్దిలపాలెం/సీతంపేట/కూర్మన్నపాలెం: దేశంలో ఎంతో ప్రతిష్టాత్మకమైన, జాతీయ స్థాయిలో పేరొందిన ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఐటీల్లో ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామ్ (జేఈఈ) మెయిన్స్ ఫలితాల్లో విశాఖ విద్యార్థులు అదరగొట్టారు. ఉత్తమ ర్యాంకులు సాధించి సత్తా చాటారు. ఆయా కేటగిరిల్లో వందలోపు ర్యాంకులు సాధించారు. వీరితోపాటు అధిక సంఖ్యలో విద్యార్థులు అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హత సాధించారు. అందులోనూ ప్రతిభ చాటితే కోరుకున్న ఐఐటీల్లో సీటు గ్యారంటీ అవుతుంది.



కంప్యూటర్ ఇంజనీర్ అవుతా



జేఈఈ మెయిన్స్‌లో ఓపెన్ కేటగిరిలో 138 ర్యాంకు సాధించాను. ఇంటర్ శ్రీ చైతన్య రామన్ భవన్‌లో చదివాను. ఇంటర్‌లో 986 మార్కులు వచ్చాయి. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మంచి ర్యాంకు సాధించి చెన్నై ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ చదవాలని అనుకుంటున్నాను. నాన్న బీఎస్ఎన్ఎల్‌లో అకౌంట్స్ ఆఫీసర్, అమ్మ కృష్ణా కళాశాలలో బోటనీ లెక్చరర్. అక్క మెడిసన్ చదువుతోంది.

– డి.జి.ఎస్.ధర్మ ప్రతాప్, శ్రీనగర్, రామాటాకీస్ రోడ్

బ్రాండ్ కోసం ప్రయత్నిస్తా..



జేఈఈ మెయిన్స్‌లో దివ్యాంగుల కేటగిరీలో 4వ ర్యాంకు సాధించడం ఆనందంగా ఉంది. అడ్వాన్స్‌డ్‌లో మంచి ర్యాంకు సాధించడమే ప్రస్తుతం నా ముందున్న లక్ష్యం. మంచి ఇంజినీరింగ్ కళాశాలలో చేరి నాకంటూ ప్రత్యేకమైన బ్రాండ్ వచ్చేలా కృషిచేస్తాను. అడ్వాన్స్‌డ్ పరీక్ష కోసం రోజుకి 10 గంటల పాటు ప్రత్యేకంగా ప్రిపేర్ అవుతున్నాను. అధ్యాపకుల ప్రోత్సాహం, గైడెన్స్, పాఠ్యాంశాలపై పట్టుసాధించడానికి ఎంతగానో దోహదపడుతున్నాయి.

– ఎస్.పూజిత కృష్ణ

సాఫ్ట్‌వేర్ రంగంలో రాణిస్తా..



పదో తరగతిలో (సీబీఎస్‌సీ) 450 మార్కులు వచ్చాయి. జేఈఈ మెయిన్స్‌లో 26 ర్యాంక్ సాధించాను. తల్లిదండ్రులు, అధ్యాపకుల ప్రోత్సాహంతో ఇది సాధ్యమైంది. అడ్వాన్స్‌డ్‌లో మంచి ర్యాంక్ సాధించి ఐఐటీలో కంప్యూర్ సైన్స్ చదువుతాను. సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడతాను.

– పి.హర్షవర్ధన్

ఎలక్ట్రికల్ ఇంజనీర్ అవుతా..



పదో తరగతిలో (సీబీఎస్‌సీ) 98.6 శాతం మార్కులు వచ్చాయి. జేఈఈ మెయిన్స్‌లో 96వ ర్యాంకు సాధించాను. అధ్యాపకుల సూచనలు తీసుకొని అడ్వాన్స్‌డ్ కోసం సిద్ధమవుతున్నాను. మంచి ర్యాంకు సాధించి ఐఐటీ ముంబైలో ఈఈఈలో చేరి ఎలక్ట్రికల్ ఇంజనీర్ అవుతాను. –ఎ.పాండ్యే

సివిల్స్ సాధిస్తా..



జేఈఈ మెయిన్స్ ఓపెన్ కేటగిరిలో 2,012, ఓబీసీ కేటగిరిలో 354వ ర్యాంకు సాధించాను. అడ్వాన్స్‌డ్ కోసం సిద్ధమవుతున్నాను. ఇంజినీరింగ్ పూర్తి చేసి సివిల్స్ సాధించడమే లక్ష్యం. నాన్న నాగభూషణరావు ప్రైవేట్ పాఠశాలలో అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా పనిచేస్తున్నారు. –శంబంగి హేమహేవిల్, వడ్లపూడి

అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ దరఖాస్తు గడువు పెంపు

మహారాణిపేట: అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ 2025–26 కోసం దరఖాస్తు గడువును పొడిగించినట్లు ఆర్మీ రిక్రూటింగ్ ఆఫీసర్ ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కేటగిరీల్లో దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 25వ తేదీ వరకు గడువు పొడిగించారు. ఆసక్తి గల అభ్యర్థులు www.joinindianarmy.nic.in ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఈసారి ఒక అభ్యర్థి రెండు వేర్వేరు కేటగిరీలకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. ఆన్‌లైన్ కామన్ ఎంట్రన్స్ ఎగ్జామ్ (సీఈఈ)ను తొలిసారిగా తెలుగుతో సహా 13 వేర్వేరు భాషల్లో నిర్వహిస్తారు. ఎన్‌సీసీ ఎ, బి, సి సర్టిఫికెట్ హోల్డర్లు, అగ్నివీర్ టెక్నికల్ కేటగిరీలో ఐటీఐ/డిప్లమో అర్హత కలిగిన అభ్యర్థులకు బోనస్ మార్కులు కేటాయించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, తూ.గో., ప.గో., కృష్ణా, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కోనసీమ, ఏలూరు, కాకినాడ, ఎన్టీఆర్, యానం నుంచి అర్హత గల అభ్యర్థులంతా అగ్నివీర్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఉచిత ఉపాధి శిక్షణ

సింధియా: విశాఖ పోర్ట్ అథారిటీ సీఎస్సార్ నిధుల ద్వారా సెమ్స్.. యువకులకు ఉచిత ఉపాధి ఆధారిత శిక్షణ అందించనుంది. 27 ఏళ్ల లోపు వయసు కలిగిన, బీటెక్ (మెకానికల్), డిప్లమో (ఎలక్ట్రికల్, మెకానికల్), ఐటీఐ (ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, వెల్డర్, టర్నర్), ఇంటర్, డిగ్రీ, 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు ఈ శిక్షణకు అర్హులు. ఈ శిక్షణ కార్యక్రమంలో భాగంగా ప్రొడక్ట్ డిజైన్ ఇంజనీరింగ్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, సీఎన్‌సీ ఆపరేటర్/ప్రోగ్రామర్, ఇన్వెంటరీ క్లర్క్, వేర్ హౌస్ పికర్/ఎగ్జిక్యూటివ్, కొరియర్ సూపర్‌వైజర్ వంటి కోర్సుల్లో రెండు నుండి ఐదు నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఆసక్తి కలిగిన విశాఖ పోర్ట్ పరిసర ప్రాంతాల (తెల్ల రేషన్ కార్డు కలిగిన) అభ్యర్థులు సింధియా జంక్షన్ సమీపంలోని సెమ్స్ కేంద్రంలో గానీ, 8688411100, 8331901237, 0891-2704010 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చు. ఈ నెల 22న గవర్నమెంట్ క్వీన్ మేరీస్ గర్ల్స్ హైస్కూల్ వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'

మహారాణిపేట: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థల్లో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల ఎలక్ట్రానిక్ వ్యర్థాల తొలగింపు అంశం కావడంతో, ఉద్యోగులు తమ కార్యాలయాల్లోని పనికిరాని ఎలక్ట్రానిక్ పరికరాలను సేకరించి జీవీఎంసీకి అందించేందుకు సిద్ధం చేశారు. కలెక్టర్ కార్యాలయంలో డీఆర్‌వో భవానీ శంకర్ పర్యవేక్షణలో ఈ ప్రక్రియ జరిగింది. జిల్లా పరిషత్‌లో సీఈవో పి.నారాయణమూర్తి, పంచాయతీరాజ్ ఎస్ఈ కార్యాలయంలో ఎస్ఈ శ్రీనివాసరావు, గ్రామీణ నీటి సరఫరా విభాగంలో ఎస్ఈ కె.ఎస్.ఎస్ చౌదరి ఆధ్వర్యంలో ఇదే తరహా కార్యక్రమాలు జరిగాయి.



ఈ-వ్యర్థాలను సేకరించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఉద్యోగులు

వెలవెలబోతున్న హార్బర్





ఎప్పుడు కళకళలాడే ఫిషింగ్ హార్బర్ మత్స్య వేట నిషేధం అమల్లోకి రావడంతో శనివారం బోసిపోయింది. తూర్పు తీరంలో ఈనెల 14వ తేదీ అర్ధరాత్రి నుంచి చేపల వేట నిలిచి పోయింది. ఎక్కడ బోట్లు అక్కడే ఉండిపోయాయి. పది నెలలపాటు సముద్రంలో అవిశ్రాంతంగా చేపల వేట చేసే మత్స్యకారులకు రెండు నెలల పాటు విశ్రాంతి లభించనుంది. ఈ నెల 14వ తేదీ నాటికి దాదాపు 2,500 బోట్లు హార్బర్‌లో జెట్టీకి చేరుకున్నాయి. అన్ సీజన్ కావడంతో బోట్లకు మరమ్మతులు చేస్తున్నారు. జూన్ 15వ తేదీ నుంచి చేపల వేట మొదలవుతుంది.

– మహారాణిపేట









ఖాళీగా దర్శనమిస్తున్న రోడ్డు

హైడ్రామా

- గిఫ్ట్‌డీడ్ స్థలాల్లో దుకాణాల తొలగింపులో నాటకీయ పరిణామాలు
- ముందే సమాచారం ఇచ్చి తొలగింపునకు ప్రయత్నం
- అడ్డుకున్న దుకాణదారులు, కార్పొరేటర్ భర్త

మధురవాడ: కోట్లు విలువ చేసే జీవీఎంసీ గిఫ్ట్‌డీడ్ స్థలాల్లో వారసుల ముసుగులో అనధికార వ్యక్తులు ఏళ్ల తరబడి దుకాణాలు ఏర్పాటు చేసి లక్షల్లో అద్దెలు వసూలు చేస్తుంటే, వాటిని పరిరక్షించాల్సిన జీవీఎంసీ అధికారులు వారి సేవలో తరిస్తున్నారు. మధురవాడ మిథిలాపురి వుడా కాలనీ–జాతీయ రహదారి జంక్షన్‌లో కోట్లు విలువ చేసే భూముల్లో ఏళ్ల తరబడి సాగుతున్న దందాపై సాక్షిలో ప్రచురితమైన కథనాలపై విధిలేక జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించారు. శనివారం వీరు ఆ దుకాణాల తొలగింపు డ్రామాకు శ్రీకారం చుట్టారు. ముందే దుకాణదారులకు సమాచారం ఇచ్చి, ప్లానింగ్ సెక్రటరీలు ప్రవీణ్, నవీన్, లక్ష్మునాయుడును, ప్రైవేట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బందిని సదరు దుకాణాల వద్దకు పంపించారు. అప్పటికే అక్కడ కాపలా కాసి ఉన్న దుకాణదారులు తమకు స్టే ఆర్డర్ ఉందంటూ ప్లానింగ్ సెక్రటరీలతో వాగ్వాదానికి దిగి, తొలగింపు పనులను అడ్డుకున్నారు. ఒక దశలో వారిని కూడా బెదిరించారు. దుకాణదారులకు ఏడో వార్డు కార్పొరేటర్ భర్త, టీడీపీ నాయకుడు పిళ్లా వెంకటరావు తదితరులు మద్దతుగా నిలిచారు. ఇది వారసుల మధ్య వాగ్వాదానికి దారితీయగా స్థానిక నాయకులు సర్దిచెప్పారు.

మీడియాపై కవ్వింపు చర్యలు

ఆ సమయంలో దుకాణదారులు కవ్వింపు, బెదిరింపు చర్యలకు పూనుకున్నారు. తామే ఫొటోస్టూడియో వాళ్లతో ఫొటోలు తీయించి ఇస్తామని, మీరు ఫొటోలు తీయాల్సిన అవసరం లేదని విలేకరులకు ఫొటోలు, వీడియోలు తీసి మరీ కవ్వింపు చర్యలకు పూనుకున్నారు.

న్యాయసలహా తీసుకుని తొలగిస్తాం

దీనిపై జీవీఎంసీ జోన్–2 టౌన్ ప్లానింగ్ ఏసీపీ తిరుపతిరావును వివరణ కోరగా తమకు స్టే ఆర్డర్ ఉందంటూ దుకాణదారులు, కార్పొరేటర్ భర్త పిళ్లా వెంకటరావు, ఇతర నాయకులు అడ్డుకున్నారన్నారు. దీనిపై న్యాయ సలహా తీసుకుని స్టే వెకేట్ దుకాణాలన్నీ తొలగిస్తామని చెప్పారు.



దుకాణాల తొలగింపును అడ్డుకుంటున్న టీడీపీ నాయకుడు పిళ్లా వెంకటరావు, దుకాణదారులు

మైనర్‌పై యువకుని దాడి

చాకుతో గొంతుకోసిన వైనం



నిందితుడు వడ్డి శ్రీరామ్

పెదగంట్యాడ: మండలంలోని శుక్రవారం రాత్రి ఇరువర్గాల మధ్య జరిగిన స్వల్ప వివాదం తీవ్ర విషాదానికి దారితీసింది. మద్యం మత్తులో ఉన్న యువకుల మధ్య ఘర్షణ అనంతరం, ఓ యువకుడు మరో బాలుడిపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఈ ఘటనకు సంబంధించి న్యూపోర్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, జీవీఎంసీ 74వ వార్డు పరిధిలోని టీజీఆర్ నగర్‌కు చెందిన మైనర్, భారత్ ఐటీఐలో ఎలక్ట్రీషియన్ కోర్సు చదువుతున్నాడు. శుక్రవారం రాత్రి సుమారు 8.30 గంటల సమయంలో మైనర్ తన స్నేహితులు గణేష్, మణిదీప్, వేణు మాధవ్, లోకేష్‌తో కలిసి దయాల్‌నగర్ కొండపై మద్యం సేవిస్తున్నాడు. అదే సమయంలో పెదగంట్యాడకు చెందిన వడ్డి శ్రీరామ్ తన స్నేహితులతో అక్కడికి రావడంతో ఇరువర్గాల మధ్య చిన్నపాటి వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం ఇరువర్గాల వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. సుమారు గంట తర్వాత, రాత్రి 9.30 గంటల సమయంలో మైనర్ తన స్నేహితులతో కలిసి మొల్లివానిపాలెం వెళ్లాడు. అక్కడ ఒక పాన్ షాపు వద్ద ఉండగా, శ్రీరామ్ తన స్నేహితులతో తిరిగి వచ్చి మైనర్‌పై కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో మెడ , చేతిపై తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్నేహితులు అతడిని గాజువాకలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం మైనర్ చికిత్స పొందుతున్నాడు. నిందితుడు వడ్డి శ్రీరామ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్యాస్ సబ్సిడీ సొమ్ము విడుదల

మహారాణిపేట: రెండో విడత గ్యాస్ సబ్సిడీ నిధులు విడుదలైనట్లు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఇప్పటివరకు 40,132 మంది లబ్ధిదారులు గ్యాస్ బుక్ చేసుకున్నారని పేర్కొన్నారు. వీరిలో 26,651 మంది లబ్ధిదారులకు వారి బ్యాంక్ అకౌంట్‌లో సొమ్ము జమ చేసినట్లు తెలిపారు. లబ్ధిదారులు ఆందోళన చెందవద్దని, అర్హులందరికి సొమ్ము జమ చేస్తామన్నారు.

పెళ్లి పేరుతో మోసగించిన వ్యక్తి అరెస్టు

సీతమ్మధార: మహిళను ప్రేమ పేరుతో నమ్మించి, గర్భవతిని చేసి పెళ్లికి నిరాకరించిన వ్యక్తిని ఫోర్తుటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు ఇలా.. దొండపర్తి, మండావారిపేట ప్రాంతానికి చెందిన ఉమామహేశ్వరి (26) భర్తతో మనస్పర్థలు కారణంగా విడాకులు తీసుకున్నారు. గత మూడేళ్లగా నగరంలోని ఓ డయోగ్నస్టిక్ సెంటర్‌లో ఉద్యోగం చేస్తోంది. ఈ క్రమంలో బంధువైన రవి కుమార్ ఆమెతో పరిచయం పెంచుకున్నాడు. ప్రేమిస్తున్నానని.. పెళ్లి చేసుకుంటానని నమ్మించి దగ్గరయ్యాడు. ఈ క్రమంలో ఆమె గర్భం దాల్చింది. తీరా పెళ్లి చేసుకోమని అడిగితే తప్పించుకుతిరుగుతున్నాడు. ఫోన్‌కు కూడా స్పందించడం లేదు. దీంతో ఆమె ఫోర్తుటౌన్ పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు పోలీసులు రవికుమార్‌పై అత్యాచారం కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

జేఈఈ మెయిన్స్‌లో ఎసెంట్ విద్యార్థుల సత్తా



ఉత్తమ ర్యాంకుల సాధించిన విద్యార్థులతో ఎసెంట్ అధ్యాపక బృందం

మద్దిలపాలెం: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఎసెంట్ ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు కళాశాల డైరెక్టర్లు తెలిపారు. కళాశాల విద్యార్థి ఎస్.వూజిత కృష్ణ రిజర్వుడ్ కేటగిరిలో 4వ ర్యాంకు సాధించడం గర్వకారణమన్నారు. అలాగే జాతీయ స్థాయిలో వరుసగా 203, 208, 408, 450, 618, 813, 926, 941, 983, 1102, 1322 వంటి టాప్ ర్యాంకులను ఎసెంట్ విద్యార్థులు సాధించారని పేర్కొన్నారు. అలాగే అన్ని కేటగిరిల్లో కళాశాలకు చెందిన 31 మంది విద్యార్థులకు 5000లోపు ర్యాంకులు వచ్చాయన్నారు. 204 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారని తెలిపారు.

శశి కళాశాల విద్యార్థుల ప్రతిభ



బి. బాల అనిక్



ఎమ్. హరితేజ



పి. హర్షవర్ధన్

తగరపువలస: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో సంగివలసలో గల శశి కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ ఫలితాల్లో పి.హర్షవర్ధన్ 99.90 శాతం, ఎం.హరితేజ 99.88 శాతం, బి.బాల అనిక్ 99.67 శాతం, డి.మోహన్ 99.56, పి.శ్రావణ్ 99.52 శాతం, కె.నాగరామ్‌చరణ్ 99.49 శాతం, ఆర్.మౌళి 99.45శాతం, డి. స్టీఫెన్ 99.45 శాతం సాధించినట్లు శశి విద్యా సంస్థల చైర్మెన్ బురుగుపల్లి వేణుగోపాలకృష్ణ, వైస్ చైర్మన్ మేక నరేంద్ర కృష్ణ తెలిపారు. 99 శాతంతో 14 మంది, 98 శాతంతో 25 మంది, 97 శాతంతో 39 మంది, 96 శాతంతో 54 మంది, 91 శాతంతో 71 మంది, 90 శాతంతో 140 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

తిరుమల విజయభేరి



ఉదయ్ పవన్



వరుణ్ కుమార్



వేద హర్ష

తగరపువలస: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో తిరుమల కళాశాల విజయభేరి మోగించింది. ఎస్.ఉదయ్ పవన్ ఓపెన్ కేటగిరిలో 384వ ర్యాంకు, గారా వరుణ్ కుమార్ 999వ ర్యాంక్, వాసూరి వేద హర్ష 1546వ ర్యాంకు, కె.సువర్ణ రామ్ ప్రత్యూష్ 2077వ ర్యాంకులు పొందారని తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు పేర్కొన్నారు. వివిధ కేటగిరీల్లో 500లోపు ముగ్గురు, 1000లోపు ఏడుగురు, 2000లోపు 24 మంది, 4000లోపు 47 మంది, 5000లోపు 55 మంది, 10000లోపు 98 మంది, 20000లోపు 162 మంది, 30000 మంది 234 మంది ఉత్తమ ర్యాంకులు సాధించారని తెలిపారు. మొత్తం 700 మంది అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారన్నారు. విద్యార్థులను రెసిడెంట్ డైరెక్టర్స్ కె.ఎస్.వి.వి.సత్యనారాయణ, ఎం.సత్యనారాయణ అభినందించారు.

నారాయణ విద్యార్థుల సత్తా



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో డీజీఎం హనుమంతరావు

సీతమ్మధార: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో నారాయణ విద్యా సంస్థల(హాస్టల్ డివిజన్) విద్యార్థులు మరోసారి సత్తా చాటారని సంస్థ డీజీఎం డి.హనుమంతరావు తెలిపారు. జాతీయ స్థాయిలో 100లోపు 2, 12, 16, 36, 42, 44, 72 ర్యాంకులతో పాటు, ఓపెన్ కేటగిరీలో పప్పల శ్రీహర్షవర్ధన్ 26వ ర్యాంక్, పి.ఆనంద్ చక్రవర్తి 86, ఎ.పాండ్య 95, పూర్ణ సాయి మమ్మిడి 116, ఆరంగి సాత్విక్ 271, ఎల్.సాయి ప్రియతం 326, టి.మనోహర్ 328, ఆదివిష్ణు సుబ్రహ్మణ్యం 461, పాట్నూరు కార్తీక్ 481, కొత్తకోట వెంకట అరవింద్ 494, గైతం విజయ కాశ్యప్ 513, బి.ఈశ్వర్ తనూజ్ 521, ప్రభాస్ చంద్ర సింగ్ 692, లక్ష్య జైన్ 732, పి.ప్రశాంతి 818వ ర్యాంకులు సాధించారని వివరించారు. మొత్తంగా 100లోపు మూడు ర్యాంకులు, 500లోపు 10 ర్యాంకులు, వెయ్యిలోపు 15 ర్యాంకులు తమ విద్యార్థులు సాధించారన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

శ్రీవిశ్వ విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు




ర్యాంకులు సాధించిన శ్రీవిశ్వ విద్యార్థులు

సీతంపేట: జేఈఈ మెయిన్స్ 2025 ఫలితాల్లో శ్రీవిశ్వ జూనియర్ కళాశాల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారు. వివిధ కేటగిరిల్లో తెల్లూరి చరణ్ కార్తికేయ 311 ర్యాంకు, అంజూరి తారక్‌రామ్ 407, సిహెచ్.వెంకట హేమవర్ధన్ 586, బి.షణ్ముఖ నాయుడు 648, వై.రాజశేఖర్ 688 ర్యాంకులు సాధించారు. వెయ్యిలోపు ర్యాంకులు ఐదుగురు, 5 వేల లోపు ర్యాంకులు 29 మంది, 10 వేల లోపు ర్యాంకులు 47 మంది సాధించారు. మొత్తంగా 247 మంది ఎన్ఐటీ, ఐఐఐటీల్లో సీట్లు పొందే అర్హత తెచ్చుకోవడం విశేషం. విద్యార్థులను చైర్మన్ కె.ధర్మరాజు, డైరెక్టర్ పి.సూర్యనారాయణ అభినందించారు.

'అ అంటే అమలాపురం'.. అభిమానులకు చేదు అనుభవం

హోరెత్తిన డీఎస్పీ మ్యూజికల్ కాన్సర్ట్



సీతమ్మధార/సీతంపేట: నగరంలోని విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ (పోర్టు స్టేడియం) వేదికగా శనివారం రాత్రి ప్రముఖ సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ మ్యూజికల్ కాన్సర్ట్ యువతను ఉర్రూతలూగించింది. ఆయన అందించిన ఉత్సాహభరితమైన పాటలకు, డ్యాన్స్‌లకు యువతి, యువకులు కేరింతలు కొడుతూ సందడి చేశారు. రాత్రి 7 గంటలకే కార్యక్రమం ప్రారంభం కావాల్సి ఉండగా, దేవిశ్రీ ప్రసాద్ రాక కాస్త ఆలస్యం కావడంతో 8.30 గంటలకు మొదలైంది. అయితే, ఈ కార్యక్రమంలో నిర్వాహకుల తీరు అభిమానులకు తీవ్ర ఆగ్రహం తెప్పించింది. టికెట్ల విక్రయంలో భారీ మోసానికి పాల్పడ్డారని బాధితులు ఆరోపించారు. ఒకసారి స్కానింగ్ చేసి లోపలికి పంపిన టికెట్లను కూడా మళ్లీ అమ్మకానికి పెట్టినట్లు అభిమానులు గుర్తించి గొడవ చేశారు. కొంత మంది వ్యక్తులు బ్లాక్‌లో టిక్కెట్లు విక్రయించారని, దీనిపై పోలీసులు ఎలాంటి చర్యలు చేపట్టలేదని వాపోయారు.



సంధ్యా సమయంలో ఆకాశం నుదుటిన తిలకం పెట్టినట్లుగా సూరీడు ఎర్రబడ్డాడు. ఉదయం 8 గంటల నుంచి చండ ప్రచండంగా విజృంభిస్తూ.. ఉక్కపోతతో విలవిల్లాడేలా చేసినా.. సాయంత్రం సమయంలో అస్తమిస్తున్న రుధిరుడిగా కనిపించిన భానుడ్ని చూసి.. నగరవాసులు ముచ్చటపడ్డారు. -ఫొటో: సాక్షిఫొటోగ్రాఫర్, విశాఖపట్నం